క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నయీంనగర్‌లోని రాజాజీనగర్, రంగ్ బార్ వెనుక వైపు, పద్మాక్షి రోడ్డు, జీఎస్ఎం స్కూల్ ప్రాంతంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ గుజ్జెటికి చెన్నైలోని డీమ్డ్ టు బీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఆప్టిమైజ్డ్ బ్యాక్‌గ్రౌండ్ సబ్‌ట్రాక్షన్ ఫర్ హై పెర్ఫార్మెన్స్ వీడియో టెక్స్ట్ డిటెక్షన్' అనే అంశంపై పరిశోధనాత్మక వ్యాసాన్ని ప్రొఫెసర్ సెల్వప్రియ పర్యవేక్షణలో సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కోమల్‌రెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి అభినందించారు.

నియామకం



వరంగల్: జాతీయ వినియోగదారులు, మానవ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర సెక్రటరీగా ఉప్పల సురేందర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆల్ ఇండియా ప్రెసిడెంట్ ఆర్కే జైన్, తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ సహారాబాను, స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పల్నాటి ప్రశాంత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేయూ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మెట్టు రవి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మెట్టు రవి ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

పద్మాక్షి దేవస్థాన ఆస్థాన పండితుడికి సన్మానం



హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవస్థాన ఆస్థాన వేద పండితుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని ఇటీవల రాష్ట్రస్థాయిలో వేదరత్న బిరుదుతో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా హనుమద్గిరి పద్మాక్షి పరపతి సేవాసంస్థ, పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు ఆలయ ఆవరణలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి హాజరై షణ్ముఖ పద్మనాభ అవధాని దంపతులను అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి కార్యదర్శి నీలారపు రాజుకుమారి, దేవాలయ వంశపారం పర్య అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, శ్యాంసుందర్‌రెడ్డి, ముక్కా ప్రకాష్, సదానందం, పద్మావతి, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -2లో సత్తా చాటిన శ్రావణికి అభినందన



ఖిలా వరంగల్: తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ బిల్లా శ్రావణి ఇటీవల గ్రూప్ -2 ఫలితాల్లో మహిళా విభాగం రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఖిలా వరంగల్ తూర్పుకోటలో ఆమెను ఏవీఎస్ లిటిల్ జేమ్స్ హైస్కూల్ చైర్మన్ అంకతి వీరస్వామి, డైరెక్టర్ అంకతి సాగర్ శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, మహేందర్, చాంద్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు తొలగించాలి



మడికొండ: మడికొండ – రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ అడ్‌హక్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు మడికొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ డంపింగ్ యార్డు తరలించే వరకూ స్థానికులందరూ సహకరించాలని కోరారు. అందుకోసం మడికొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలిరావాలని కమిటీ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో బైరి సాంబరాజు గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

చైర్మన్ వర్సెస్ డైరెక్టర్లు

- రెండు వర్గాలుగా పీఏసీఎస్ సొసైటీ సభ్యులు
- నలుగురు డైరెక్టర్లకు నోటీసులు
- ఓ డైరెక్టర్ రాజీనామా



వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో డైరెక్టర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఇక్కడ చైర్మన్ మేర్గు రాజేష్ వర్సెస్ నలుగురు సభ్యుల మధ్య విభేదాలు పొడచూరాయి. దాంతో నలుగురు సభ్యులపై వేటు పడే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఓ సభ్యురాలు తన పదవికి రాజీనామా చేశారు.

తమకు వాటా రాలేదని..

ఇటీవల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఇటీవల మూడు పోస్టులు భర్తీ చేశారు. అయితే, వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మామూళ్లలో తమకు వాటా రాలేదని సభ్యులు పేర్కొంటున్నారు. దీంతో సభ్యులు, చైర్మన్ల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో ఇరువురు పరస్పరం ఫిర్యాదు చేశారు. దీంతో చైర్మన్ రాజేష్‌కు నోటీసులు జారీచేసి తీసుకున్న రుణాన్ని రికవరీ చేసుకున్నారు. సమావేశాలకు హాజరు కాని నలుగురు సభ్యులకు నోటీసులు జారీ చేయడమే కాకుండా డెయిరీ రుణం తీసుకుని కిస్తీ కట్టని వారికి అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే, సకాలంలో సమావేశాలకు హాజరుకాని ఓ సభ్యురాలు తమ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మరో ముగ్గురు సభ్యులు కూడా రాజీమానా యోచనలో ఉన్నట్లు తెలిసింది.

నోటీసులు జారీ చేశాం..

పీఏసీఎస్ చైర్మన్ ఫిర్యాదు మేరకు నలుగురు సభ్యులకు నోటీసులు జారీ చేశాం. పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటాం.

– జగన్మోహన్‌రావు, నోడల్ ఆఫీసర్

మొబైల్‌తో కంటి చూపు మందగింపు



కంటి అద్దాలు అందుకున్న విద్యార్థులతో అప్పయ్య

- జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య

హసన్‌పర్తి: మొబైల్ వాడకం వల్ల కంటి చూపు మందగిస్తుందని హనుమకొండ జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య అన్నారు. 65వ డివిజన్ సుబ్బయ్యపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయంలో కంటిలోపం ఉన్న విద్యార్థినులకు కళ్లజోళ్లను అందజేశారు. ఇటీవల ఇక్కడ నిర్వహించిన వైద్య శిబిరంలో కంటిలోపం ఉన్న విద్యార్థినులను గుర్తించారు. గురుకులంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అప్పయ్య మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ పరికరాల వాడడం వల్ల కంటి చూపు కోల్పోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకృష్ణ, నోడల్ అధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, వైద్యాధికారి కుమారస్వామి, అప్తాల్మిక్ అధికారి మల్లారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ మంజుల, సంతోష్, ఫార్మసిస్ట్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



హసన్‌పర్తి: ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లు శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం బడ్జెట్‌లో ఆశ కార్యకర్తలకు నిధులు పెంచాలని డిమాండ్‌చేశారు. మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, స్కూటీలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పుల్లా అశోక్, ఆశ వర్కర్లు రాజేశ్వరి, బొక్క సునీత, నవమణి, శోభ, శైలజ, సరిత, ఎన్.రజిత, విజయకుమారి పాల్గొన్నారు.

సర్వే పారితోషికం చెల్లించాలి



వరంగల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024, నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో వరంగల్ జిల్లాలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కుమార్, ఎస్.ప్రసాదరావు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్‌లో డీఆర్వో విజయలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా వరంగల్ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు నిర్వర్తించిన కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు.

గుట్కా ప్యాకెట్లు సీజ్

రామన్నపేట: మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పిన్నావారి వీధిలో పవన్‌రాజ్ పురోహిత్.. నిషేధిత గుట్కా ప్యాకెట్లు అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేసి రూ.26,050 విలువైన గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుడు వ్యాపారి పవన్‌రాజ్ పురోహిత్‌ను అదుపులోకి తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. గుట్కాలు సప్లై చేసే హుజూరాబాద్‌కు చెందిన సురేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

లోపం ఉన్న చిన్నారులకు అండగా నిలవాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



చిన్నారులతో వరుణ్‌రెడ్డి, తదితరులు

హన్మకొండ అర్బన్: సమాజంలో మానసిక లోపం ఉన్న చిన్నారులను అందరితో పాటు సమానంగా గుర్తిస్తూ, వారికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డేను పురస్కరించుకొని నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. మానసిక లోపం ఉన్న పిల్లలకు మల్లికాంబ మనోవికాస కేంద్రం తరఫున నిర్వాహకులు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. అనంతరం చిన్నారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక లోపం ఉన్న పిల్లలు చేసిన నృత్య ప్రదర్శన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను తిలకించారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. నృత్య ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. అపర్ణ ఈఎస్‌టీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ మాడిశెట్టి సుదీప్, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ ఎం.అజిత్ పాషా, మల్లికాంబ సంస్థ నిర్వాహకులు బండా రామలీల, బండా సదానందం, కోడం కల్యాణ్, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు రుణాల మంజూరుకు అంగీకారం



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

నయీంనగర్: రైతులకు పంట ఆధారంగా దీర్ఘకాలిక రుణాలు అవసరం ఉన్న నేపథ్యంలో వారికి అదనపు రుణాల మంజూరుకు బ్యాంకర్లు అంగీకారం తెలిపినట్లు తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయగా హనుమకొండ న్యాయ సేవా సదన్‌లో హనుమకొండ న్యాయ సేవాధికారుల కార్యదర్శి సీనియర్ జడ్జి కాస్మా దేశ్‌పాండే, వరంగల్ న్యాయ సేవాధికారుల కార్యదర్శి ఎం.సాయికుమార్ సమక్షంలో బ్యాంకర్లు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. పంట ఆధారంగా దీర్ఘకాలిక రుణాలు అవసరం ఉన్న రైతులు రుణ దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. అర్హులైన రైతులందరూ తమ ప్రైవేట్ అప్పులు తీర్చుకోవడానికి రుణాలు మంజూరు చేయడానికి బ్యాంకర్లు ఒప్పుకున్నారని శ్రీహరిరావు తెలిపారు. కార్యక్రమంలో పరికల కిషన్‌రావు, హింగె భాస్కర్, తిరుపతి రాజు, బాబురావు, తోకల ఆదిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రేపు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఈనెల 23న హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంస్థ మాజీ జిల్లా కార్యదర్శులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, మేరుగు అశోక్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని రోటరీ క్లబ్ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు తరలిరావాలని కోరారు. సమ్మేళనానికి అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ రావు, రచయిత, గాయకుడు సుద్దాల అశోక్‌తేజ, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వీరయ్య హాజరు కానున్నారని తెలిపారు. తొలుత సమ్మేళన పాటల సీడీ, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు ఇసంపెల్లి బాబు, ఉప్పలయ్య, రాగుల రమేష్, గోనె యువరాజు, గానుగంటి గంగాధర్, బిరెడ్డి సాంబశివ, చుక్క ప్రశాంత్, గద్దం రవి, బోగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

27న 'హలో బీసీ.. చలో ఢిల్లీ'



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

నయీంనగర్: హలో బీసీ.. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ శాసనసభలో బిల్లును ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీల లెక్కలు తేల్చాలనే డిమాండ్‌లతో ఈనెల 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేనున్నట్లు తెలిపారు. నాయకులు దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, అశోక్ గౌడ్, నాగరాజ్, మాదం పద్మజాదేవి, శోభారాణి, అరుంధతి, సులోచన, ప్రమోద పాల్గొన్నారు.

రైల్వే సబ్ డివిజన్ ఆస్పత్రిని ప్రారంభించాలి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కాజీపేట రూరల్: కాజీపేటలో ఆధునిక సౌకర్యాలతో నూతనంగా నిర్మించిన కాజీపేట సబ్ డివిజన్ రైల్వే ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. ఈమేరకు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆకుల శ్రీకాంత్ పటేల్, తోపుచర్ల మధుసూదన్‌రావు, ఎండి.చాంద్‌పాషా, రాజ్‌కుమార్ యాదవ్, భగవాన్ ఉపాధ్యాయ, గందసిరి శ్రీకాంత్, శ్రావణ్‌యాదవ్, రేణుకుంట్ల కల్యాణ్, జరీనా పాల్గొన్నారు.

రైల్వే సంఘ్ నేతల వినతి

కాజీపేటలో పెండింగ్‌లో ఉన్న లోకోపైలట్ల రిక్వెస్ట్ బదిలీలను వెంటనే అమలు చేయాలని, కాజీపేట డిపో సామర్థ్యం పెంచాలని, క్రూబీట్లను పునఃపరిశీలించాలని, ఎంఏసీపీఎస్‌ను అమలు చేయాలని, అలవెన్స్‌లను అమలు చేయాలని కోరారు. ఈమేరకు రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కాజీపేట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, గుప్తా, లక్ష్మినారాయణ, పరమేశం, అజీజ్‌పాషా, నర్సింగరావు, ముస్తాక్ విజ్ఞప్తి చేశారు.

ఓయూలో నిషేధాజ్ఞలను ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్యమాలను నిషేధిస్తూ ఓయూ రిజిస్ట్రార్ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకుని కేయూ మొదటి గేట్‌వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి కావ్య మాట్లాడుతూ ఓయూలో విద్యార్థి ఉద్యమాలపై ఆంక్షలు అప్రజాస్వామికం అన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ, హక్కులకు ఇది పూర్తి విరుద్ధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనూష, గణేష్, శ్రీజ, శివాజీ, ప్రశాంత్, రాజ్‌కుమార్, నరేష్, సిద్దు, నాగరాజు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూములను వేలం వేయొద్దు

హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల రాంబాబు మాట్లాడుతూ వర్సిటీ భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం శోచనీయమన్నారు. ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు సాయికుమార్, ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, బాధ్యులు అంబాల కిరణ్, ప్రశాంత్, పూజ, శివ, రాజ్‌కుమార్, సాయి, అభి, ఫణేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

24న ఎస్ఎఫ్ఐ మహాసభలు

కేయూ క్యాంపస్: ఈనెల 24న గణితశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ 52వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ పిలుపునిచ్చారు. యూనివర్సిటీలోని హ్యుమానిటీస్ భవనంలో విద్యార్థులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మహాసభలో భవిష్యత్ కర్తవ్యాలను ఎజెండాను రూపొందించనున్నట్లు తెలిపారు. వర్సిటీల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ సహాయ కార్యదర్శి బిరెడ్డి జశ్వంత్, అనిల్, నరేష్, కన్నారావు, అఖిల్, వేణు, పర్వీ, శరత్, రాకేష్, సాయికుమార్, రాజ్‌కుమార్, అభిషేక్, సందీప్, సాయి పాల్గొన్నారు.

దేవస్థాన హద్దుల నిర్ధారణ వాయిదా



గొడవ పడుతున్న ఇరువర్గాల ప్రజలు

హసన్‌పర్తి: ఆనవాళ్ల మేరకు మహంకాళి ఆలయ స్థల హద్దులు నిర్ధారిస్తామని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంగా వివాదాస్పదంగా మారిన మహంకాళి దేవస్థాన భూమి హద్దుల నిర్ధారణ కోసం వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు శుక్రవారం ముందుకు వచ్చాయి. ఆనవాళ్లను గుర్తించడానికి జేసీబీ సహాయంతో పునాదులు కదిలించే ప్రయత్నం చేయగా, ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో హద్దులు నిర్ధారించే కార్యక్రమాన్ని వాయిదా వేశారు. హద్దుల నిర్ధారణకు రావాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ చైన్‌మెన్ గైర్హాజరుపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, సామాజిక కార్యకర్త అనుమాండ్ల విద్యాసాగర్, మాజీ ఎంపీటీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, ఆత్మ జిల్లా మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, పద్మశాలి సంఘం నాయకులు దీకొండ భిక్షపతి, సతీష్ పాల్గొన్నారు.

పెద్దమోరీ స్థల వివాదాన్ని పరిష్కరించాలి



పెద్దమోరీ పనులను పరిశీలిస్తున్న నాయకులు

రామన్నపేట: నగరంలోని 29వ డివిజన్ పాపయ్యపేట, రామన్నపేట ప్రాంతాల్లో జరుగుతున్న పెద్ద మోరీ అభివృద్ధి పనుల్లో వెలుగు చూసిన స్థల వివాదాన్ని పరిష్కరించి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అరూరి కుమార్ సూచించారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతంలో ఇంటింటి సర్వే బృందం సభ్యులు శుక్రవారం పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రామన్నపేట, పాపయ్యపేట ప్రాంతాల్లో అనేక ఏళ్ల తరబడి సమస్యగా మారిన పెద్ద మోరీ అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని అన్నారు. స్థల వివాదం పేరుతో ప్రస్తుతం జరిగే పనులను నిలిపివేయడం సరికాదని సూచించారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ చూపి వివాదాన్ని పరిష్కరించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, పులిమాటి శివ, డి.కుమార్, సరిత, సక్కుబాయి, రాజమ్మ, పి.కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నిట్ సమీపంలో చైన్ స్నాచింగ్

కాజీపేట: కాజీపేట నిట్ కళాశాల సమీపంలోని రామకృష్ణ కాలనీలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును శుక్రవారం అపహరించుకెళ్లారు. బాధితురాలి కథనం ప్రకారం కొండవీటి రాణి తన ఇంటి ఆవరణలోని కిరాణ దుకాణాన్ని శుభ్రం చేస్తుండగా ఇద్దరు యువకులు సామాన్ల కొనుగోలు కోసం వచ్చినట్లుగా నటించి అదును చూసి ఆమె మెడలోని పుస్తెల తాడును తెంచుకుని బయటపడ్డారు. అప్పటికే ఇంటి ముందు సిద్ధంగా ఉన్న ఆటోలో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కాజీపేట పోలీసులు తెలిపారు.

హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతి గృహ విద్యార్థులకు వేసవి వేడి నుంచి రక్షణ కల్పించేందుకు కళాశాలలో చదివిన 1990వ బ్యాచ్ మెకానికల్ బ్రాంచ్ పూర్వ విద్యార్థి, ప్రముఖ వ్యాపారవేత్త కల్లూరి శ్రీనివాస్ శుక్రవారం 20 ఫ్యాన్లను హాస్టల్ మేనేజర్ శివకుమార్‌కు అందించారు.

ఎంజీఎంలో రక్తదాన శిబిరం

ఎంజీఎం: స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని సంవేదన -2లో భాగంగా నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ యాక్టివిటీస్ (నిఫా), యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో నగరంలోని ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్, నిఫా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు, సామాజిక వేత్త టీవీ.అశోక్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ అంబి శ్రీనివాస్, ఎంజీఎం బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ ఆశాదేవి, మోటివేటర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

చింతగట్టులో పశువైద్య శిబిరం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం చింతగట్టులోని మహర్షి గోశాలలో వికాస తరంగి, హనుమకొండ ఆధ్వర్యంలో శుక్రవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులను పరీక్షించి రైతులకు మందులు అందించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి ఉపాధ్యక్షుడు, పశు సంవర్ధక శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చాడ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆరు నెలలకొకసారి ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రీనివాస్, మండల పశువైద్యాధికారి క్రాంతి, ఎల్ఎ సురేష్, వికాస తరంగిణి సభ్యులు దయాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, తిరుమల్, గోశాల నిర్వాహకులు రమేష్, వివేక్, సాగర్, యాదగిరి, రాహుల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

హన్మకొండ అర్బన్: స్మార్ట్ సిటీ కింద మంజూరైన రూ.5 కోట్ల నిధుల వ్యయంతో నగరంలోని వడ్డేపల్లిలో పబ్లిక్ హెల్త్ సెంటర్, వడ్డేపల్లిలోని విజయపాల్ కాలనీ, టీచర్స్‌కాలనీ ఫేజ్ -1, బ్యాంక్ కాలనీల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, ఫిషర్స్ మెన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల సమ్మన్న, 58వ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, సోషల్ మీడియా రాష్ట్ర సెక్రటరీ ఎండీ నేహాల్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని దక్షిణముఖ అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో 21వ వసంత నవరాత్రోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం రాత్రి ఆవిష్కరించారు. వచ్చేనెల 6న సీతారామచంద్ర స్వామి కల్యాణ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ తెలిపారు.

14 నుంచి మా భూమి రథయాత్ర

నయీంనగర్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భూమి, సంపద, రాజ్యాన్ని సమానంగా అందించడానికి లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్రను ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14నుంచి జూలై 11వ తేదీ వరకు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టనున్నట్లు హనుమకొండ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ప్రతినిధులు మరిపెల్లి లింగయ్య, రమేష్ తెలిపారు.

ఆ ప్రైవేట్ స్కూల్‌పై చర్య తీసుకోవాలి

హన్మకొండ: ప్రభుత్వ అనుమతి లేకుండానే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి తెలిపారు. హనుమకొండ, రాంనగర్‌లలో అనుమతులు లేకుండానే హోర్డింగ్‌లు పెట్టి, కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ, ముందస్తు అడ్మిషన్లు చేపట్టిన మెరీడియన్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. రాంనగర్‌లోని ఓ భవనానికి స్కూల్ బోర్డు ఏర్పాటు చేసి అడ్మిషన్లు స్వీకరిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి మోసపోవద్దని తల్లిదండ్రులను కోరారు.

వర్గీకరణ ఘనత మంద కృష్ణమాదిగదే

నయీంనగర్: ఎస్సీ వర్గీకరణ విజయం మాదిగ అమరవీరులదని, అలాగే, మాదిగ జాతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసి పోరాటం చేసిన మాదిగ జాతి నాయకుడు మంద కృష్ణమాదిగదని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ అన్నారు. హనుమకొండ లష్కర్ సింగారంలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బొక్క రాజేష్ మాదిగ, ఎర్ర రాము మాదిగ, దామెర అరుణ్ మాదిగ, శ్రీనివాస్ మాదిగ, మహేందర్ మాదిగ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం

కాజీపేట: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ కులాలకు సరైన న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు అలకుంట్ల ఎల్లయ్య విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో రూ.47,456 కోట్లు కేటాయించిన విషయాన్ని పాలకులు గుర్తించాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ఖిలా వరంగల్: గొర్రెలు, మేకల సజీవ దహనానికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. మట్టి కోట సమీపంలో ఎల్బీ గండి వద్ద మూగజీవుల మృతికి కారణమైన దోషులను వదిలిపెట్టొద్దని ఆమె కోరారు. కార్యక్రమంలో పసునూటి వేణు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్ట్

ఖిలా వరంగల్: ఓ బాలికపై అత్యాచారానికి ఒడిగట్టిన ఓ వ్యక్తిని పోక్సో కేసు కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు. లక్ష్మణ్ అనే వ్యక్తి ప్రేమపేరుతో ఓ బాలికకు దగ్గరై అత్యాచారానికి ఒడిగట్టాడు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.